


నేటి ఉదయం

తెలుగు దినపత్రిక



ప్రచురణ : విజయనగరం | గురువారం 05-11-2026 | చీఫ్ ఎడిటర్ : కె వి ఎల్ ఎస్ బాలసుబ్రహ్మణ్యం | సంపుటి : 1 | సంచిక : 105 | పేజీలు : 4 | వెల : 2.00

మారిన సమీకరణాలు..

వీరేష్ చంద్రదేవ్‌కు పెరిగిన మద్దతు

- గెలుపు ఖాయం.. మెజారిటీ పైనే అంచనాలు
- తూర్పు ముఠాలోనూ పెరిగిన అభిమానం
- ఇది కురుపాం జడ్పీటిసి తెదేపా అభ్యర్థి పరిస్థితి



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

పోలింగ్ వేళ కురుపాం మండల జడ్పిటిసి ఎన్నికల తీరులో ఒక్కసారిగా సమీకరణాలు మారాయి. ఇప్పటివరకు తెదేపా, వైకాపా మధ్య నామమాత్రపు పోటీ ఉండగా అది నేటి గురువారం ఓటింగ్ రోజు నాటికి మరి కాస్త మారి తెదేపా అభ్యర్థి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్‌కు మండల నలుమూలల, అన్ని వర్గాల అనుకూలత మరింత పెరిగి మద్దతు బలపడింది. జడ్పీటీసీ పరిధిలో 14 ఎంపీటీసీ సెగ్మెంట్లు ఉండగా కురుపాం మేజర్ పంచాయతీ ఓటర్లు దాదాపు వీరేశ్ చంద్ర దేవ్ పట్ల ఏకపక్ష నిర్ణయానికి వచ్చిన విషయం తెలిసిందే. అలాగే నీలకంఠాపురం, మొండెంఖల్ మేజర్ మేజర్ పంచాయతీ లలో కూడా మెజారిటీ వర్గాలు తెదేపా పార్టీ పట్ల ముఖ్యంగా వీరేష్ చంద్ర దేవ్ నాయకత్వానికి మద్దతు తెలుపుతూ ముందుకు రావడం తో గెలుపు ఖాయం కాగా మెజారిటీపై అంచనాలు పెరుగుతున్నాయి. మరో కోణంలో తూర్పు ముఠా ప్రాంతం నుండి వైకాపా తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి ఉండగా చివరి నిమిషంలో ఆ ప్రాంతానికి చెందిన కీలక గిరిజన నేతలు కుటుంబాలు తెదేపా వైపు మొగ్గు చూపడం మరింత ముఖ్యంగా జడ్పీ చైర్మన్ బరిలో ఉన్న వీరేష్ చంద్ర దేవ్ కు మండలంలో గౌరవప్రదమైన మెజారిటీ కట్టబెట్టడం ద్వారా ఆ పార్టీ అధిష్టానం లో మరింత ఆదరణ దక్కడానికి కారణం కావాలని తద్వారా తమ ప్రాంత సమస్యలు ప్రజల అవసరాలు భవిష్యత్తులో ఆయన ద్వారా నెరవేర్చుకోవచ్చన్న ఆలోచనతో మెజారిటీ వర్గాలు వచ్చినట్లు ఫలితంగా ఏకపక్షంగా మద్దతు తెలిపేందుకు నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు 36 వేల కోట్లు ఉన్న మండలంలో 20వేలు వరకు పోల్ అయ్యే పరిస్థితి ఉండగా వాతావరణ అనుకూలిస్తే మరింత పెరిగే అవకాశం ఉంది. ఏది ఏమైనా కురుపాం జడ్పిటిసి స్థానం మన్యం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఫలితాలు ఏ మేరకు ప్రజల నాడిని ప్రతిబింబిస్తాయో వేచి చూడాల్సిందే.

నేడు ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ

ఎన్నికల మహా సంగ్రామం

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఎంతో ఉత్కంఠ రేపుతున్న స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. రేపు (గురువారం) రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో జడ్పీటీసీ (గూజ), ఎంపీటీసీ (వీూజ) స్థానాలకు ఓటింగ్ జరగనుంది. ఇప్పటికే ప్రచారం ముగియడంతో ఎన్నికల యంత్రాంగం పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు, సిబ్బందిని తరలించే ప్రక్రియను పూర్తి చేసింది.

నేటి పోలింగ్ షెడ్యూల్ మరియు స్థానాల వివరాలు:

పోలింగ్ సమయం ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఎన్నికలు జరుగుతున్న స్థానాలు: మొత్తం 582 జడ్పీటీసీ స్థానాలు, మరియు 7,778 ఎంపీటీసీ స్థానాలకు రేపు పోలింగ్ జరగనుంది. ఫలితాల విడుదల: పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ పెట్టెలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి, ఈ నెల 7వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. **సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా:** ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 31,472 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు జిల్లాల వారీగా నిఘాను తీవ్రం చేశారు:సమస్యాత్మక కేంద్రాలు: మొత్తం 2,645 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. అత్యంత సమస్యాత్మక కేంద్రాలు: 1,841 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా వర్గీకరించి, అక్కడ అదనపు బలగాలను, కేంద్ర బలగాలను మోహరించారు. అధునాతన సాంకేతికత: ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా ఉండేందుకు లెక్కింపు మరియు పోలింగ్ కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర పర్యవేక్షణ (ఔవఎఘిర్ఱఅస్త్ర) ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలను అడ్డుకోవడానికి ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ల రంగంలోకి దిగాయి. అల్లర్లు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని పోలీస్ శాఖ హెచ్చరించింది.

31,472 కేంద్రాల్లో పోలింగ్‌కు పటిష్ఠ ఏర్పాట్లు!



900 మంది పోలీసులతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు

ప్రశాంతంగా, పారదర్శకంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు చర్యలు : జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం మన్యం

నవంబర్ 5వ తేదీన జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణం లో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఉన్న 799 పోలింగ్ కేంద్రాల వద్ద సుమారు 900 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల భద్రతా పర్యవేక్షణ కోసం కురుపాం, పాలకొండ, సాలూరు ప్రాంతాలకు ఒక్కొక్క డీఎస్పీని బాధ్యులుగా నియమించడంతో పాటు పార్వతీపురం అదనపు ఎస్పీకి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో తక్షణమే స్పందించేందుకు ప్రత్యేక నిఘా బృందాలు, స్థిర



నిఘా బృందాలు, ఎగిరే నిఘా బృందాలు, మార్గ సంచార పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. డ్రోన్ల ద్వారా పరిసర ప్రాంతాలపై నిఘా ఉంచడంతో పాటు ఓట్ల లెక్కింపు కేంద్రాలు, భద్రపరిచే గదుల వద్ద నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలించడం మొదలుకొని, పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ పెట్టెలను పటిష్ట పోలీసు భద్రత మధ్య నిర్దేశిత భద్రపరిచే కేంద్రాలకు తరలించే వరకు పక్కా ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలి

ప్రజలు, రాజకీయ నాయకులు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా గౌరవించాలని ఎస్పీ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా భారతీయ నాగరిక సురక్షా సంహితలోని 163వ సెక్షన్ అమల్లో ఉంటుందని, నలుగురికి మించి వ్యక్తులు గుమిగూడరాదని తెలిపారు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేసే హక్కును కలిగి ఉన్నారని, వారిని బెదిరించడం, ఒత్తిడి చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి చర్యలకు ఎవరూ పాల్పడరాదని స్పష్టం చేశారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు నగదు, మద్యం, బహుమతులు పంపిణీ చేయడం, ఇతర ప్రలోభాలకు గురిచేయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, పోలీసు సిబ్బంది చేపట్టే తనిఖీలకు అభ్యర్థులు, వారి ప్రతినిధులు సహకరించాలని, విధులకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘించే వారిపై సంబంధిత ఎన్నికల చట్టాలు, భారతీయ న్యాయ సంహిత తదితర చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిబంధనలు

పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మద్దతుదారులు ఎలాంటి టెంట్లు, ప్రచార శిబిరాలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఓటర్లకు పంపిణీ చేసే ఓటరు స్లిప్పులపై రాజకీయ పార్టీలు లేదా వ్యక్తులకు సంబంధించిన గుర్తులు ఉండకూడదని సూచించారు. ఓటర్లు క్రమపద్ధతిలో వరుసల్లో వెళ్లేలా చూడాలని, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ఓటు వేసిన అనంతరం ఓటర్లు పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ఉండకుండా చూడాలని, అనధికార వ్యక్తులు, వాహనాలు ప్రవేశించకుండా పటిష్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో మార్గ సంచార పోలీసు బృందాలు, ప్రత్యేక బలగాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, పోలీసు సిబ్బంది తమకు కేటాయించిన విధులను పూర్తి బాధ్యతతో నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, వాటిని క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని, రాజకీయ విభేదాల కారణంగా ప్రజల మధ్య ఘర్షణలు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని ఎస్పీ కోరారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు, ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

పరిషత్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఉదయం 7 గంటల నుంచి పోలింగ్
- 15 జెడ్పీటీసీ, 226 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎన్. ప్రభాకర రెడ్డి



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. నవంబర్ 5వ తేదీ గురువారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. జిల్లాలో రెండో విడత సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మొత్తం 15 గ్రామీణ మండలాల్లో 15 జెడ్పీటీసీ, 226 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఎన్నికల్లో మొత్తం 6,43,874 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వివరించారు. వీరిలో 3,14,899 మంది పురుషులు, 3,28,910 మంది మహిళలు, 65 మంది ఇతర ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి విధులు, బాధ్యతలపై ఇప్పటికే స్పష్టమైన సూచనలు అందించామని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి పంపిణీ, రవాణా తదితర ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన ఎన్నికల సిబ్బంది : ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. ఆయా కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన ఎన్నికల సామగ్రిని తీసుకొని సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారని పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మురసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సీఎం ఏరియల్ వ్యూ.. పంటల పరిశీలన



ఉదయం ప్రతినిధి – అమరావతి

మురసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం ఏరియల్ వ్యూ నిర్వహించారు. గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. చిలకలూరిపేట, ఒంగోలు, కొత్తపట్నం, చినగంజాం, చీరాల, బాపట్ల ప్రాంతాల్లో మురసు తుఫాన్ నష్టాన్ని ముఖ్యమంత్రి పరిశీలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో హెలికాప్టర్ ల్యాండ్ కావడానికి అనుకూల వాతావరణం లేకపోవడంతో సీఎం ఏరియల్ వ్యూ ద్వారా పంటలను పరిశీలిస్తున్నారు. ఏరియల్ వ్యూ అనంతరం అమరావతి సచివాలయానికి చేరుకుని ఆర్టీజీఎస్ నుంచి మురసు తుఫాన్ ప్రభావంపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

2,721 డీఎస్సీ పోస్టులతో నోటిఫికేషన్ జారీకి ఛాన్స్

ఉదయం ప్రతినిధి – అమరావతి

డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసే ఛాన్స్ ఉంది. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక 2 వేల 721 పోస్టులతో రెండో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సమాచారం. గత నెల 13వ తేదీన సార్ట్ నోటిఫికేషన్‌ను సీఎం చంద్రబాబు సర్కార్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లు 931, స్కూల్ అసిస్టెంట్లు (స్పెషల్ ఎడ్యూకేషన్) 255, సెకండరీ గ్రేడ్ టీచర్స్ 1231, ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యూకేషన్) 304 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఏడాది మెగా డీఎస్సీ ద్వారా 16 వేల 342 పోస్టులను ఏపీ విద్యాశాఖ భర్తీ చేసిన విషయం తెలిసిందే.

మురసు తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు

హోం మంత్రి వంగలపూడి అనిత

ఉదయం ప్రతినిధి –అమరావతి



తుఫాన్ బాధితలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత భరోసా కల్పించారు. వారం వ్యవధిలో వచ్చిన రెండు తుఫాన్‌లను తమ ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా ఎదుర్కొందని పేర్కొన్నారు. ఏపీ సచివాలయంలో ఈరోజు (బుధవారం) తుఫాన్ సహాయక చర్యలపై హోంమంత్రి అనిత సమీక్షా సమావేశం నిర్వహించారు. తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లో పలు కీలక అంశాలపై హోం మంత్రి దిశానిర్దేశం చేశారు.

ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి.. : తుఫాన్‌ల ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు త్వరితగతిన సహాయం అందిస్తున్నామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో వెంటనే కేంద్ర బృందాలను పంపినందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు తెలిపారు. మురసు తుఫాన్ ముప్పు ఎదుర్కొన్న 7 జిల్లాల్లోని 465 గ్రామాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేశామని వెల్లడించారు. భారీ వర్షాలు, వరదల వేళ ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు.

పొంగుతున్న వాగులను దాటవద్దు.. : కంట్రోల్ రూమ్‌ల ద్వారా 24 గంటలూ పరిస్థితులను పర్యవేక్షించాలని హోంమంత్రి సూచించారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తక్షణమే స్పందించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాలతో పొంగుతున్న వాగులు, రహదారులు, రోడ్లు దాటే ప్రయత్నం చేయరాదని హోంమంత్రి అనిత మార్గనిర్దేశం చేశారు.

డిఎంహెచ్ఓ విజయలక్ష్మి సూచన మేరకు ల్యాబ్ టెక్నీషియన్లకు సమీక్షా సమావేశం



ఉదయం ప్రతినిధి - పార్వతీపురం

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. విజయలక్ష్మి ఆదేశాల మేరకు ల్యాబ్ టెక్నీషియన్లకు బుధవారం వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్.సి.డి అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు, జిల్లా మలేరియా కన్సల్టెంట్ రామచంద్ర తో కలిసి పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సెకండరీ హెల్త్ ఆసుపత్రిల్లో వెక్టార్ బోర్న్ వ్యాధుల నియంత్రణ కార్యక్రమానికి సంబంధించి ల్యాబ్ టెక్నీషియన్ల విధి నిర్వహణలు, పని తీరుపై సమీక్షించారు. మలేరియా కు సంబంధించిన రికార్డులు, పరీక్షల నివేదికలు సకాలంలో పొందు పర్చాలన్నారు. వ్యాధి నిర్ధారణ, చికిత్స అందించడంలో జాప్యం ఉండరాదని ఆదేశించారు. మలేరియా గుర్తిస్తే స్థానికంగా లేదా వలస వచ్చిన కేసు అనే విషయాన్ని నిర్ధారించి వెంటనే సంబంధిత వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. మలేరియా సోకిన వ్యక్తి చుట్టుప్రక్కల వారికి కూడా నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. మలేరియా నిర్ధారణ ఆర్.డి.టి కిట్స్ ను సరైన ఉష్ణోగ్రతలో భద్ర పర్చాలన్నారు. రక్త పూతలు నిర్ణీత పద్ధతిలో మాత్రమే సేకరించి, ప్రతీ స్లైడ్ పై పేషెంట్ కోడ్, తేదీ నమోదు చేసి స్లైడ్ ఆరిన తర్వాత మాత్రమే ల్యాబ్ కు పంపాలన్నారు. పిఎఫ్ , పివి మలేరియాకు చికిత్స పూర్తి కోర్సు వాడేలా పర్యవేక్షణ తప్పనిసరి అని అన్నారు. హాస్టల్స్ లో మలేరియా పాజిటివ్ నిర్ధారణ అయితే వెంటనే సంబంధిత వైద్య సిబ్బందికి సమాచారం తెలియజేసి, ఆ గదిలో ఉన్న విద్యార్థులందరికీ పరీక్షలు జరపాలన్నారు. హైరిస్క్ గ్రామాల్లో ఫీవర్ సర్వే, ప్రత్యేక వైద్య శిబిరాలు, లార్వా వేట, డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జయగౌడ్ , మలేరియా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో దుమ్మురేపిన రెబల్ అభ్యర్థులు

ఉదయం ప్రతినిధి - విజయవాడ

ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో పలు చోట్ల రెబల్ అభ్యర్థులు ట్విస్ట్ ఇచ్చారు. టికెట్ దక్కలేదని వెనక్కి తగ్గకుండా.. స్వతంత్రులుగా బరిలోకి దిగి ప్రధాన పార్టీల అభ్యర్థులకు షాక్ ఇచ్చారు. ఆదోనిలో జనసేన రెబల్ ఏకంగా చైర్‌పర్సన్ స్థానాన్నే దక్కించుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. ఏపీ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో రెబల్ అభ్యర్థులు ఊహించని విధంగా సత్తా చాటారు. పార్టీల టికెట్లు దక్కకపోయినా.. స్వతంత్రులుగా బరిలోకి దిగి ఓటర్ల మద్దతుతో విజయం సాధించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం మున్సిపాలిటీలో జనసేన ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. మొత్తం 36 వార్డులున్న పిఠాపురంలో ఏకంగా పది వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో రెబల్స్ గెలుపు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఆదోని మున్సిపల్ ఎన్నికల్లో జనసేన రెబల్ అభ్యర్థి గెలిచి ఈ ఎన్నికల్లో చరిత్ర సృష్టించారు.ఇక కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ ఎన్నికల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. జనసేన రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగిన స్వప్న మల్లప్ప నాయకర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి చైర్‌పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా ఆదోని చైర్‌పర్సన్ స్థానం టీడీపీకి కేటాయించారు. నాగమణిని టీడీపీ అభ్యర్థిగా ఖరారు చేశారు. దీంతో జనసేన ఆదోని ఇన్‌చార్జి మల్లప్ప నాయకర్ తన భార్య స్వప్నను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దించారు. చివరకు ఆమె విజయం సాధించడంతో ఆదోని రాజకీయాల్లో ఈ ఎన్నిక ప్రత్యేకంగా నిలిచింది. స్వప్న భర్త మల్లప్ప నాయకర్ మాట్లాడుతూ.. స్వప్న గెలుపును పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా ఇస్తున్నామని పేర్కొన్నారు. తాను ఎప్పటికీ పవన్ అభిమానిని అని.. ఆయనతోనే ఉంటానని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ తనకు అండగా ఉన్నారన్నారు..పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలులోనూ స్వతంత్ర అభ్యర్థులు పార్టీలకు షాక్ ఇచ్చారు. నాలుగు వార్డుల్లో రెబల్ అభ్యర్థులు విజయం సాధించారు. ఇద్దరు జనసేన రెబల్స్, ఇద్దరు టీడీపీ రెబల్ అభ్యర్థులు బరిలో నిలిచి గెలిచారు. ఇక ఏలూరు మున్సిపల్ ఎన్నికల్లోనూ స్వతంత్ర అభ్యర్థులు ప్రభావం చూపించారు. దాదాపు ఎనిమిది మంది ఇండిపెండెంట్లు విజయం సాధించారు.మొత్తంగా ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో రెబల్ అభ్యర్థుల గెలుపు ప్రధాన పార్టీలకు కొత్త రాజకీయ సమీకరణాలను తెరపైకి తెచ్చింది. పిఠాపురం, గొల్లప్రోలు, ఏలూరులో కార్పొరేటర్, కౌన్సిలర్ స్థాయిలో రెబల్స్ సత్తా చాటగా.. ఆదోనిలో ఏకంగా చైర్‌పర్సన్ స్థానాన్ని రెబల్‌గా బరిలోకి దిగిన అభ్యర్థి సొంతం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

కొఠియా గిరిజనులను భయభ్రాంతులకు గురిచేయడం దారుణం

గిరిజనుల స్వేచ్ఛను, ఓటు హక్కును హరించే ప్రయత్నాలను సహించేది లేదు : రాష్ట్ర మంత్రి సంధ్యారాణి

ఉదయం ప్రతినిధి - పార్వతీపురం మన్యం

కొఠియా ప్రాంతంలోని గిరిజనులను ఒడిశా ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేయడం అత్యంత దారుణమని రాష్ట్ర మంత్రి సంధ్యారాణి తీవ్రంగా ఖండించారు. అమాయక గిరిజనుల జీవితాలతో చెలగాటమాడుతూ, వారి స్వేచ్ఛను, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును హరించే ప్రయత్నాలు చేయడం సరికాదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కొఠియా ప్రాంతంలోని 29 గిరిజన గ్రామాల ప్రజలను ఒడిశా అధికారులు గత కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఎన్నికలను బహిష్కరించాలని గిరిజనులపై ఒత్తిడి తీసుకురావడం బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. గిరిజనులను గ్రామాల నుంచి తీసుకెళ్లి ఇతర ప్రాంతాల్లో దాచిపెట్టడం, వారు ఓటు వేయడానికి వస్తారనే ఉద్దేశంతో వారి వాహనాలను సైతం స్వాధీనం చేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికలను వాయిదా వేయాల్సిన అవసరం ఉంటే ఆ నిర్ణయం తీసుకోవాల్సింది ఎన్నికల సంఘమని, అంతేగానీ గ్రామాల్లోకి వచ్చి గిరిజనులను భయపెట్టడం,



ఎన్నికలను బహిష్కరించాలని అభ్యర్థులను బెదిరించడం ప్రజాస్వామ్య విరుద్ధమని స్పష్టం చేశారు. ఎప్పటి నుంచో అమల్లో ఉన్న సుప్రీంకోర్టు యథాతథ స్థితి ఆదేశాలను ఇప్పుడు కొత్తగా వచ్చినట్లుగా చూపిస్తూ హడావుడి చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని మంత్రి ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియలో గిరిజనులు స్వేచ్ఛగా పాల్గొనకుండా అడ్డుకోవడం, ఓటు హక్కు వినియోగించుకోకుండా ఆంక్షలు విధించడం సరైన పద్ధతి కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ అధికారులపై, పోలీసు సిబ్బందిపై ఒడిశా అధికారులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కొఠియా గ్రామాల్లోకి వచ్చి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేయడం, వారి వాహనాలను స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలను తీవ్రంగా తప్పుబట్టారు. అమాయక గిరిజనుల హక్కులను గౌరవిస్తూ, వారిని ఎలాంటి ఒత్తిళ్లకు గురిచేయకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని ఒడిశా అధికారులకు సూచించారు. గిరిజనుల స్వేచ్ఛను, ఓటు హక్కును హరించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజనులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి హక్కులు, స్వేచ్ఛకు భంగం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటుందని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు.

రెఫరండంగా మారుతొన్న ఎన్నికలు

ఉదయం ప్రతినిధి - గుంటూరు

తాజాగా జరిగిన స్థానిక సంస్థల పోలింగ్ ఒకరకంగా ఫస్ట్ ఎపిసోడ్‌గానే చూడాలి. ఎందుకంటే.. అన్ని పార్టీలకూ కీలకమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ముందున్నాయి. అయితే.. ఈ ఎన్నికల్లో వాస్తవ పోలింగ్ శాతం గతంతో పోల్చుకుంటే బాగా తగ్గుముఖంపట్టింది. 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో 69 శాతం మేరకు పోలింగ్ నమోదైంది. దీనితో పోల్చుకుంటే.. ఇప్పుడు సగటున 55 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. ఈ పరిణామాలు.. అన్ని పార్టీలకూ అనేక విషయాలను నేర్పుతున్నాయని అంటున్నారు విశ్లేషకులు. ఏ పార్టీలో అయినా.. నాయకుల మధ్యకలివిడి ముఖ్యం. కూటమి పార్టీల్లో అధిష్టానాలు పదే పదే చెప్పినా.. ఈ తరహా కలివిడి లేని చోట చాలా వరకు ఓటింగ్ తగ్గిపోయింది. విశాఖ, విజయవాడ వంటి కీలక నగర పాలక సంస్థల పరిధిలో 50 శాతం ఓటు బ్యాంకు కూడా మించలేదు. దీనికి కారణం.. చివరి నిమిషం వరకు కూడా పార్టీలో ఐక్యత సాధించే ప్రయత్నం చేసినా.. దానిని అందుకోలేక పోవడమేనని అంటున్నారు. తద్వారా పోలింగ్‌పై ప్రజలు నిరాసక్తత చూపించారు. ఈ ఎన్నికలను రిఫరెండం అని కూటమి పార్టలు ప్రకటించక పోయినా.. సహజంగానే రెండున్న రేళ్ల ప్రభుత్వ పాలన తర్వాత.. వచ్చిన ఎన్నికలు కావడంతో అందరూ రిఫరెండంగానే భావిస్తారు. ఈ పరంగా చూసుకుంటే.. ఓటింగ్ శాతం తగ్గడంపై ప్రభుత్వం పునరాలోచన చేసుకోవాలని విశ్లేషకులు చెబుతున్నారు. కీలకమైన పథకాల విషయంలో జరుగుతున్న జాప్యం పెద్దగా ప్రభావం చూపిస్తోందన్న దివారి మాట. నిజానికి ఆర్టీసీ ఉచిత ప్రయాణం తీసుకు వచ్చిన ఓట్లు కొంత మేరకు ప్రభుత్వానికి ప్లస్ అయ్యాయన్న వాదన కూడా ఉంది. ప్రజల్లో మార్పు: స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారు. అయితే.. ఈ సారి మా త్రం ఈ తరహా సంస్కృతి కొరవడింది. అదేసమయంలో ప్రచారానికి కూడా పెద్దగా గడువు లేకపోవడం, మధ్యలో తుఫాను బీభత్సం వంటివి కూడా ఈ ఎన్నికలపై ప్రభావం చూపించాయని అంటున్నారు.

ఓటర్లందరూ విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా ఎన్ ప్రభాకర రెడ్డి

ఉదయం ప్రతినిధి - పార్వతీపురం



గురువారం జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్‌లో ఓటర్లందరూ విధిగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా ఎన్ ప్రభాకర రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో మరియు గ్రామీణాభివృద్ధిలో ప్రతి ఒక్క ఓటు అత్యంత కీలకమైనదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసిందని, ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. భద్రత దృష్ట్యా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఓటర్లు తమ ఓటరు గుర్తింపు కార్డు (జూ×జ) తో పాటు ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ వంటి ఎన్నికల సంఘం సూచించిన ఏదైనా గుర్తింపు పత్రాన్ని చూపించి ఓటు హక్కును పొందోచ్చని స్పష్టం చేశారు. అలాగే వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక సౌకర్యాలు కల్పించామని వెల్లడించారు. ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా ప్రతి ఒక్కరూ భాధ్యతాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఏపీలో రాహుల్ ప్లాన్ ఏంటి?

ఉదయం ప్రతినిధి - విజయవాడ



మొత్తం మీద కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఒక విషయంలో విజయం సాధించారు. ప్రధాని కాలేకపోయిన ఆయన విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చి బలమైన ప్రతిపక్ష నాయకుడుగా మారారు. అది తాజాగా ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో కళ్ళకు కట్టినట్లుగా కనిపించింది. రాహుల్ నాయకత్వం మీద మొదట్లో సందేహాలు వ్యక్తం చేసిన పార్టీలు కూడా భుజం కలిపి నడిచాయి. అంతా కలసి ఐక్యతను చాటాయి. దాంతో రాహుల్ కేంద్ర బిందువుగా మారారు. ఇక ఉత్తరాదిలో యూపీ నుంచి సమాజ్ వాది పార్టీతో కాంగ్రెస్ కి దోస్తీ ఉంది. అలాగే బీహార్ లో ఆర్జేడీతో పొత్తు ఉంది. పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ ఓటమి తరువాత కాంగ్రెస్ తో మరింత సాన్నిహిత్యం నెరపుతున్నారు. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే శివసేన మరో వైపు ఎన్సీపీ శరద్ పవార్ పార్టీతో చెలిమి చేస్తూ బలంగానే ఉంది. గుజరాత్ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఢిల్లీ పంజాబ్ వంటి చోట్ల కాంగ్రెస్ బలంగానే ఉంటూ తన పోరాటం సొంతంగా సాగిస్తోంది.ఇక దక్షిణాదిన మొదటి నుంచి కాంగ్రెస్ బలంగానే ఉంది. కర్ణాటక తెలంగాణాలలో సొంతంగానే అధికారంలోకి వచ్చింది. కేరళలో ఇటీవల పవర్ ని అందుకుంది. తమిళనాడులో ఆరు దశాబ్దాల తరువాత ప్రభుత్వంలో చేరింది. రెండు మంత్రి పదవులు కూడా తీసుకుంది. సినీ దళపతి విజయ్ స్థాపించిన టీవీకేతో కొత్త స్నేహం నెరిపి దక్షిణాదిన అయిదింట నాలుగు రాష్ట్రాలలో తన హవాను స్పష్టం చేస్తోంది. అన్నీ బాగానే ఉన్నా మొదటి నుంచి కాంగ్రెస్ కి పెట్టని కోటగా ఉన్న ఏపీని ఎందుకు వదిలేస్తోంది అన్నదే చర్చగా ఉంది. దేశంలో ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ ఉద్యమిస్తున్నారు. మరి ఏపీలో కూడా ఈ ఉద్యమాన్ని ఎత్తుకుని అక్కడ విపక్ష భూమికను బలంగా ముందుకు తీసుకుని వెళ్ళే చాన్స్ ని ఎందుకు వదిలేస్తున్నారు అన్న చర్చ సాగుతోంది. ఇక స్థానిక సంస్థలకు ఎన్నికలు ప్రస్తుతం ఏపీలో జరుగుతున్నాయి. అన్ని పార్టీలు తమ శక్తి మేరకు బరిలో నిలబడి తలపడుతున్నాయి. ఇండిపెండెంట్లు కూడా అనేక చోట్ల జాతకాన్ని పరీక్షించుకుంటున్నాయి. అలాంటిది కాంగ్రెస్ అయితే ఎందుకో ఇంతటి సువర్ణ అవకాశాన్ని వదిలేసుకుంటోందా అన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్ కి గత మూడు ఎన్నికలూ దెబ్బేశాయి. డిపాజిట్లు గల్లంతు అయ్యాయి. కానీ కాలం ఎపుడూ ఒకేలా ఉండదు అంటారు. అలాంటిది ఏపీలో అధికార కూటమి విపక్ష వైసీపీలకే రాజకీయ మైదానం వదిలేసి కాంగ్రెస్ ఇంకా వేచి చూసే ధోరణిలో ఉందా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. వామపక్షాలను ఇతర పాటీలని కలుపుకుని ఫ్రంట్ గా కట్టి ముందుకు సాగితే స్థానిక ఎన్నికల్లో ఎన్నో కొన్ని సీట్లు అయినా దక్కుతాయని కదా అని అంటున్నారు. ఒక వేళ అలా కాకపోయినా కాంగ్రెస్ తన రాజకీయ ఉనికిని చాటుకునే విధంగా ఉండేది కదా అని కూడా అంటున్నారు. అయితే ఏపీ మీద మాత్రం కాంగ్రెస్ కి సరైన ప్లాన్స్ ఉన్నాయా లేవా అన్నదే ఇపుడు అంతా చర్చించుకుంటున్నారు. ఏపీలో ఎన్డీయే బలంగా ఉంది. విపక్షంలో వైసీపీ ఉంది. జగన్ ని కలుపుకుంటే: దాంతో కాంగ్రెస్ ఇక్కడ తన రాజకీయ విస్తరణకు కొత్త ఆలోచనలు చేయాల్సి ఉంది. దక్షిణాదిన అంతటా తన హవా ఉన్న కాంగ్రెస్ కి ఏపీలో ఆ పలుకుబడిని ఉపయోగించి ఎంతో కొంత ఎదగడం కష్టం కాదని అంటున్నారు. కానీ ఆ దిశగా ప్రయత్నాలు జరగకపోవడమే ఆశ్చర్యంగా ఉందని అంటున్నారు. ఏపీలో జగన్ ని కలుపుకుంటే ఇండియా కూటమికి దక్షిణాదిన మరింత బలం వస్తుందని అంటున్నారు. అయితే జగన్ వద్దు అన్నదే కాంగ్రెస్ ఆలోచనగా ఉందా అని కూడా ప్రశ్నలు వస్తున్నాయి. దాంతో ఏపీలో కాంగ్రెస్ ని బలోపేతం చేయడం కోసం రాహుల్ ప్లాన్ ఏంటి అన్నది అర్ధం కావడం లేదని అంటున్నారు.


మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌కు షాక్.. ఆధిక్యంలో డెమోక్రాట్లు

జార్జియా

అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికల ఫలితాలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీకాలంలో 'కాంగ్రెస్'పై పట్టు ఎవరిదో తేల్చే ఈ ఎన్నికల్లో, తొలి ఫలితాలు డెమోక్రాటిక్ పార్టీకి అనుకూలంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతినిధుల సభలో పలు కీలక స్థానాల్లో డెమోక్రాట్లు ఆధిక్యంలో ఉండటం రిపబ్లికన్ పార్టీలో ఆందోళన రేకెత్తిస్తోంది. నవంబర్ 3న జరిగిన ఈ ఎన్నికల్లో మొత్తం 435 ప్రతినిధుల సభ స్థానాలకు, 35 సెనేట్ స్థానాలకు, 36 గవర్నర్ పదవులకు పోలింగ్ జరిగింది. ఎన్నికలకు ముందు ప్రతినిధుల సభలో రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ (సుమారు 218-214) ఉండగా, డెమోక్రాట్లు సభలో ఆధిక్యం సాధించాలంటే కేవలం మూడు సీట్లు అదనంగా గెలుచుకోవాల్సి ఉంది. అదేవిధంగా, 53-47 మెజారిటీతో రిపబ్లికన్ల ఆధీనంలో ఉన్న సెనేట్‌ను కైవసం చేసుకోవాలంటే డెమోక్రాట్లకు నాలుగు స్థానాలు అవసరం. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తర్వాత తూర్పు తీర రాష్ట్రాల నుంచి ఫలితాలు వెలువడటం మొదలైంది. జార్జియాలో డెమోక్రాటిక్ సెనేటర్ జాన్ ఓసాఫ్ తిరిగి ఎన్నికైనట్లు ప్రముఖ మీడియా సంస్థలు ప్రకటించాయి. ఇది డెమోక్రాటిక్ పార్టీకి కీలకమైన విజయంగా భావిస్తున్నారు. అంతేకాకుండా, ఫ్లోరిడాలోని కొన్ని రిపబ్లికన్ల ఆధీనంలో ఉన్న ప్రతినిధుల సభ స్థానాల్లో కూడా డెమోక్రాట్లు ఆధిక్యంలో కొనసాగుతుండటం గమనార్హం. ఈ ఎన్నికల్లో ఓటర్లపై జీవన వ్యయం పెరగడం, అవినీతి ఆరోపణలు, ట్రంప్ పరిపాలనపై ఉన్న అసంతృప్తి వంటి అంశాలు ప్రధాన ప్రభావం చూపినట్లు ప్రాథమిక విశ్లేషణలు చెబుతున్నాయి. సాధారణంగా అధ్యక్షుడి పార్టీ మధ్యంతర ఎన్నికల్లో సీట్లు కోల్పోవడం చారిత్రకంగా జరుగుతున్నప్పటికీ, ఈసారి ఫలితాలు ఎలా ఉంటాయోనని ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ముఖ్యంగా హోరాహోరీగా ఉన్న నియోజకవర్గాల్లో తుది ఫలితాలు వెలువడటానికి కొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది. పశ్చిమ రాష్ట్రాల ఫలితాలు వెలువడిన తర్వాతే 'కాంగ్రెస్'పై ఎవరిది పైచేయి అనేది స్పష్టమవుతుంది.

మరోసారి వైఎస్సార్‌సీపీకి కోలుకోలేని దెబ్బ

ఉదయం ప్రతినిధి - విజయవాడ




ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల సరళి వైఎస్సార్‌సీపీకి మరోసారి కోలుకోలేని దెబ్బకొడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి హవా స్పష్టంగా కనిపిస్తుంటే, వైఎస్సార్‌సీపీ మాత్రం ఎక్కడో ఒకట్రెండు వార్డులు లేదా స్వల్ప ఓట్ల ఆధిక్యం దక్కినా దాన్నే ఏదో మెగా విజయంలా ప్రచారం చేసుకుంటోంది. అసలు తమకు ప్రజలు ఓట్లేయరని, కూటమి వేవ్‌లో తాము కొట్టుకుపోవడం ఖాయమని ఆ పార్టీ నాయకత్వానికి ముందే గట్టి నమ్మకం కుదిరినట్లుంది. అందుకే, ఆశించిన స్థాయి కంటే ఘోర పరాజయం ఎదురవుతున్నా, ఎక్కడో ఒకచోట లభించిన చిన్నిపాటి లీడ్‌ను పట్టుకుని ఓదార్పు వెతుక్కునే పనిలో పడ్డారు.సాక్షి మీడియా నెట్‌వర్క్‌తో పాటు సదరు పార్టీ సోషల్ మీడియా సైన్యం ప్రదర్శిస్తున్న వైఖరి ప్రజాస్వామ్యానికి నవ్వులాటగా మారింది. కూటమి అభ్యర్థులు వందలాది వార్డులలో, పోస్టల్ బ్యాలెట్లలో భారీ మెజారిటీతో దూసుకుపోతుంటే.. వాటిని కప్పిపుచ్చి, వైఎస్సార్‌సీపీకి అత్యంత అరుదుగా ఆధిక్యం వచ్చిన వార్డుల గణాంకాలను మాత్రమే హైలైట్ చేస్తూ స్క్రీన్లు నింపేస్తున్నారు. ఎక్కడో ఒక రౌండ్‌లో తాత్కాలికంగా ముందంజలోకి రాగానే, ఆ ప్యాచ్‌లను కట్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ ఏదో జగజ్జేతల్లా సంబరాలు చేసుకోవడం వారి ఆత్మవంచనకు, అంధకార ప్రతిపక్ష రాజకీయాలకు అద్దం పడుతోంది. అత్యంత విచిత్రమైన అంశమేమిటంటే.. అసలు పోలింగ్ రోజే మున్సిపల్ ఎన్నికలు అక్రమంగా జరిగాయని, తమ ఏజెంట్లను తరిమేశారని, ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని విపరీతంగా రచ్చ చేశారు. ఆఖరికి పులివెందుల మున్సిపాలిటీలో వైఎస్ జగన్ రెడ్డి తన సొంత ఓటును కూడా వేయకుండా బహిష్కరించి, రీపోలింగ్ కావాలంటూ ధర్నాలు చేశారు. కానీ కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై, అదే ఎన్నికల్లో పొరపాటున ఎక్కడైనా ఒకటి రెండు వార్డుల్లో వైఎస్సార్‌సీపీకి లీడ్ లేదా విజయం దక్కగానే క్షణాల్లో మాట మార్చేస్తున్నారు. అక్రమాలు జరిగాయన్న నోళ్లతోనే ఇప్పుడు ఆ ఓట్లను ప్రజాదరణగా ప్రచారం చేసుకుంటూ ద్వంద్వ నీతిని చాటుకుంటున్నారు. దాదాపు అన్ని పట్టణ ప్రాంతాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నుంచే కూటమి స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరుస్తూ విజయకేతనం ఎగురవేస్తోంది. వాస్తవాన్ని ఒప్పుకునే ధైర్యం లేక, ప్రజా తీర్పును గౌరవించే మానసిక పరిపక్వత లేక వైఎస్సార్‌సీపీ ఇలాంటి మైండ్ గేమ్స్‌కు తెరలేపుతోంది. ఎన్నికలు సరిగ్గా జరగలేదని ఒకవైపు విమర్శిస్తూనే, మరోవైపు వచ్చిన కొద్దిపాటి ఫలితాలకే భుజాలు తడుముకోవడం ఆ పార్టీ పతనానికి నిదర్శనం. ప్రజలు పూర్తిగా తిరస్కరించినా, సాక్షి రాతలతోనూ, పేక్ సోషల్ మీడియా పోస్టులతోనూ కాలాన్ని వెళ్లదీయవచ్చనే భ్రమల్లో వైఎస్సార్‌సీపీ బతుకుతోందని ఈ ఎన్నికల కౌంటింగ్ దృశ్యాలు స్పష్టం చేస్తున్నాయి.

డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టుల్లో గట్టి ఎదురుదెబ్బ

న్యూయార్క్

అమెరికాలో మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టుల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాలిఫోర్నియాలో సుమారు 20 వేల వివాదాస్పద మెయిల్ బ్యాలెట్లను పక్కన పెట్టాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. చివరకు అమెరికా సుప్రీంకోర్టు కూడా ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించింది.కాలిఫోర్నియాలో సుమారు 20 వేల మంది ఓటర్లు అమెరికా పౌరులు కాకపోవచ్చని ట్రంప్ ప్రభుత్వం అనుమానం వ్యక్తం చేసింది.వీరు ఓటు వేయడానికి అర్హులు కాదని అమెరికా న్యాయశాఖ ఆరోపించింది.ఈ ఓటర్లకు సంబంధించిన బ్యాలెట్లను వెంటనే పక్కన పెట్టాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను కోరింది.ట్రంప్ సర్కార్ ఆరోపణలపై కాలి ఫోర్నియా ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. దీనికి కాలిఫోర్నియా పలు అంశాలను లేవనెత్తింది. ఇందులో..కాలిఫోర్నియాలో ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. లక్షలాది మంది ఓటర్లు తమ బ్యాలెట్లను తిరిగి పంపించారు.ట్రంప్ ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో అనేక తప్పులున్నాయని కాలిఫోర్నియా అధికారులు వాదించారు.ఆ జాబితాలో అమెరికా పౌరులు, ఓటరు నమోదును క్రియాశీలంగా కొనసాగించని వ్యక్తులు కూడా ఉన్నారని పేర్కొన్నారు.ట్రంప్ ప్రభుత్వం బ్యాలెట్లను వేరు చేయాలంటూ ఫెడరల్ కోర్టును ఆశ్రయించింది. అయితే జిల్లా కోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది.ఆ తర్వాత 9వ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టులోనూ 2-1 మెజారిటీతో ట్రంప్ ప్రభుత్వానికి చుక్కెదురైంది. ఓటు హక్కు ఉన్నవారి ఓట్లు కూడా చెల్లకుండా పోయే ప్రమాదం ఉందని న్యాయమూర్తులు ఆందోళన వ్యక్తం చేశారునవంబర్ 2, 2026న ట్రంప్ ప్రభుత్వం అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వివాదాస్పద బ్యాలెట్లను తాత్కాలికంగా పక్కన పెట్టాలని అత్యవసరంగా కోరింది.కానీ సుప్రీంకోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది.

ఎమ్మెల్యే విజయ్ చంద్రకు కృతజ్ఞతలు తెలిపిన 23వ వార్డు కౌన్సిలర్ గిరి పట్నాయక్



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

పార్వతీపురం మున్సిపాలిటీలో ఇటీవల నిర్వహించిన చైర్మన్, వార్డు కౌన్సిలర్ల ఎన్నికల ఓట్ల లెక్కింపులో 23వ వార్డు కౌన్సిలర్‌గా గొడబ గిరి పట్నాయక్ 655 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం టీడీపీ ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే విజయ్ చంద్ర దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి, తన విజయానికి సహకరించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గిరి పట్నాయక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి 23వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా అవకాశం కల్పించడంతో పాటు, తన గెలుపు కోసం ఎమ్మెల్యే విజయ్ చంద్ర, ఆయన సతీమణి అనూష నిరంతరం ప్రచారం నిర్వహించి, వార్డు ప్రజలు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే దంపతులు తనపై ఉంచిన నమ్మకాన్ని వార్డు ప్రజలు కూడా నిలబెట్టారని, వారి సహకారంతో పట్టణంలోనే అత్యధికంగా 655 ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తన విజయానికి సహకరించిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర, ఆయన సతీమణి అనూష, చైర్మన్ అభ్యర్థి బెలగాం కరుణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇకపై 23వ వార్డు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని గిరి పట్నాయక్ హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తానని, వార్డులో ఏ సమస్య ఎదురైనా ఎమ్మెల్యే విజయ్ చంద్ర, మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు.

బాలల ఆరోగ్య వికాసానికి కృషి చేయాలి

ఆర్.బి.ఎస్.కె పిఓ డా. జగన్ మోహన్



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

బాలల సంపూర్ణ ఆరోగ్య వికాసానికి కృషి చేయాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. బాలల సత్వర చికిత్సా కేంద్రాన్ని (డిఇఐసి) బుధవారం సందర్శించారు. 4డి లక్షణాలు ఉన్న ఎంత మంది పిల్లలకు ప్రతీ రోజూ వైద్య సేవలు అందిస్తున్నారు, వారి సమస్యలు, ఆరోగ్యం మెరుగు వివరాలపై రికార్డులో తనిఖీ చేశారు. శారీరక, మానసిక వైకల్యాలు, పుట్టుక నుండి సంక్రమించే లోపాలు, వ్యాధులు, ఎదుగుదల జాప్యం మొదలగు సమస్యలకు కేంద్రం ద్వారా అందిస్తున్న థెరపీ, చికిత్స, ఎర్లీ ఇంటర్వెన్షన్ , ఉపకరణాల తో ఏ మేరకు మెరుగుపడుతున్నది పరిశీలించారు. ఆర్.బి.ఎస్.కె 2.ఆ స్క్రీనింగ్ అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో వైద్య సిబ్బంది, వైద్యాధికారులు పక్కగా నిర్వహించి 4డి లక్షణాలున్న వార్ని గుర్తించి అవసరమైన వారిని డిఇఐసి కి రిఫర్ చేయాలన్నారు. కేంద్రంలో సేవలతో పాటు, అవసరమైన వారికి అనుబంధ ఆసుపత్రులతో సమన్వయం చేస్తూ ఉచిత శస్త్ర చికిత్సలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. పిహెచ్సీ వైద్యులు, సిబ్బందితో డిఇఐసి స్టాఫ్ సమన్వయం చేసుకుంటూ 4డి సమస్యలున్న పిల్లలకు సత్వరమే చికిత్స అందించి వారి జీవన ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆర్.కె.ఎస్.కె విభాగశీలో రికార్డులు, ఆన్లైన్ నివేదికలు తనిఖీ చేశారు. కిశోర బాలలకు ఎప్పటికపుడు కౌన్సిలింగ్, అవగాహన నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణుడు డా ఎల్. భరత్ చంద్ర, డెంటల్ వైద్యులు డా కె. సౌజన్య , ఎర్లీ ఇంటర్వెన్సినిస్ట్ స్రవంతి, ఆర్.కె.ఎస్.కె కౌన్సిలర్ భారతి, స్టాఫ్ అంజమ్మ, మంగ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

సహకరించిన ఉద్యోగులకు అభినందనలు : కమిషనర్ బి బాలస్వామి



ఉదయం ప్రతినిధి – విజయనగరం

నగరపాలక సంస్థ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహక రించిన అధికారులకు, ఉద్యోగులకు కమిషనర్ బి బాలస్వామి అభినం దనలు తెలియజేశారు. బుధవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టామని, ప్రతిఅంశాన్ని పారదర్శకంగా జవాబుదారీతనంగా సిబ్బందికి నిర్దేశించిన విధులను శతశాతం నిర్వహించారని అధికారులు, ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు ఐవి రమణమూర్తి ఎన్ హరిబాబు మేనేజర్ ఆర్ ఎస్ ఆర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అదితిని కలిసిన మేయర్ భార్గవి



ఉదయం ప్రతినిధి – విజయనగరం

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ గా ఘన విజయం సాధించిన అవనాపు భార్గవి తన భర్త విజయ్‌తో బుధవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు మేయర్ గా టికెట్ అవకాశం కల్పించి, ప్రచారంలో కష్టించి, ఎన్నికల్లో గెలుపొందడానికి సంపూర్ణ సహకారాలు అందించిన ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు భార్గవి కృతజ్ఞతలు తెలియ చేశారు.

గురాన రాధిక దంపతులు కూడా.. : 30వ వార్డు నుంచి విజయం సాధించిన గురాన రాధిక దంపతులు కూడా ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి తరపున సహాయ సహకారాలు అందించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా.. కూటమి ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెట్టేలా..

నగర అభివృద్ధికి కృషి చేస్తా..

– నగర మేయర్ అవనాపు భార్గవి

ఉదయం ప్రతినిధి – విజయనగరం

నగర ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నగర అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని నగర మేయర్ గా ఎన్నికైన అవనాపు భార్గవి అన్నారు. తన విజయానికి ఎనలేని కృషి చేసిన ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు పట్ల విధేయతతో ఉంటానని, ఆమె మార్గ దర్శకత్వంలో నగర ప్రజలకు మెరుగైన మంచి పాలన అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వ నమ్మకాన్ని ప్రజల్లో నిలబెట్టేలా తన మామయ్య స్వర్గీయ అవనాపు సూరిబాబు గౌరవాన్ని నిలిపేలా ప్రజల కోసం మంచి పాలనతో పాటు సామాజిక సేవలు అందిస్తామన్నారు. అవనాపు కుటుంబ గౌరవాన్ని నిలబెట్టేలా ప్రజలతో నిత్యం మమేకమై ఉంటానన్నారు. ఇంతటి ఘన విజయం అందించిన ప్రజలకు, ఓటేసిన ఓటర్లకు, తన గెలుపు కోసం శ్రమించిన కూటమి కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

జెడ్పీటీసీ ఎంపీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

ఓటర్లు 49,469, పోలింగ్ కేంద్రాలు 55, పోలింగ్ సిబ్బంది 425

ఉదయం ప్రతినిధి – చీపురుపల్లి

మండలంలో గురువారం జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఎన్నికలకు సర్వం సిద్ధం అయ్యాయి. మండ లంలో పోలింగ్ కేంద్రాలు 55, పోలింగ్ అధికారులు 61 మంది, సహాయ పోలింగ్ అధికారులు 61 మంది, ఇతర ఎన్నికల సిబ్బంది 303 మంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. 49.469 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఒక జెడ్పీటీసీ స్థానానికి ముగ్గురు అభ్యర్థులు పోటీపడుతున్నారు. టీడీపీ నుంచి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, వైసీపీ నుంచి బెల్లాన వంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో ఉన్నా రు. 18 ఎంపీటీసీ స్థానాలకు 40 నామినేషన్లు దాఖలై న విషయం తెలిసిందే. చీపురుపల్లి 1 అభ్యర్థిగా ఇజ్జి రోతు నిహారిక (టీడీపీ), వైసీపీ నుంచి మహంతి లక్ష్మీ, చీపురుపల్లి 2 సబ్బి సోనియా (టీడీపీ), అడ్డూరి కృష్ణా రావు (వైసీపీ), చీపురుపల్లి 3 మీసాల కాశీ విశ్వేశ్వ రరావు (టీడీపీ), ముల్లు పైడిరాజు (వైసీపీ), చీపురుపల్లి 4 నుంచి గవిడి నాగరాజు (టీడీపీ), ఇప్పిలి అనంతం (వైసీపీ), వంగపల్లి పేటలో వెంపడాపు హైమవతి (టీడీపీ), వెంపడాపు వెంకటరత్నం (వైసీపీ).

ఆర్టీసీ మహిళా కండక్టర్ ప్రవళిక మృతి



ఉదయం ప్రతినిధి – మణుగూరు

మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) చికిత్స పొందుతూ కన్నుమూయ డం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. విధి నిర్వ హణలో ఆమెపై జరిగిన అనూహ్య దాడి చివరికి ప్రాణా లు కోల్పోయేలా చేయడం తోటి ఉద్యోగులను కలచి వేసింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచారు. ప్రవళిక అకాల మరణం పట్ల ఆర్టీసీ సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు తీవ్రగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.విధి నిర్వహణలో ఉన్న మహిళా ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని, దోషిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబానికి అండగా ప్రభుత్వం : భద్రాద్రిలో బస్సులో చిల్లర విషయంలో జరిగిన గొడవలో ప్రయాణికురాలు తోసేయడంతో తీవ్రంగా గాయపడిన కండక్టర్ ప్రవళిక చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ ఘటనపై రవా ణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రగ్ర్భాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించినా కాపాడుకోలేకపోయామని తెలిపారు. ప్రవళిక తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లు, రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం



ఉదయం ప్రతినిధి –పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమాల పురోగతిపై 04-11-2026 తేదీన జిల్లా క్షయవ్యాధి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ సలహాదారు డాక్టర్ ధీరజ్, విశాఖ విభాగం ప్రపంచ ఆరోగ్య సంస్థ సలహాదారు డాక్టర్ విజ్ఞాతి గారు మరియు జిల్లా క్షయవ్యాధి అధికారి డాక్టర్ ఎస్.కె. హఫీజా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో క్షయవ్యాధి రోగుల గుర్తింపు, క్షయవ్యాధి లక్షణాల పరీక్షల పురోగతి, క్షయవ్యాధి చికిత్సా విభాగాల వారీగా సాధించిన లక్ష్యాలు, నివేదికల నిర్వహణ మరియు క్షయవ్యాధి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. క్షయవ్యాధి కేసులను ముందుగానే గుర్తించడం, వ్యాధి నిర్ధారణ పరీక్షలను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం, కార్యక్రమాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో అన్ని క్షయవ్యాధి చికిత్సా విభాగాల సిబ్బంది మరియు జిల్లా స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కంచుకోటలో కమలం పాగా



ఉదయం ప్రతినిధి –విజయనగరం

వైసీపీకి కంచుకోటగా ఉన్న 11, 33, 38 వార్డుల్లో భారతీయ జనతా పార్టీ (బిజెపి) విజయకేతనం ఎగుర వేసింది. 11వ వార్డు సభ్యురాలిగా రవ్వా మంజు,33వ వార్డు సభ్యుడిగా కరణం శ్రీధర్, 38 వ వార్డు సభ్యు రాలిగా ఆడారి విజయలక్ష్మి విజయం సాధించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్ వర్మతో కలిసి విజయం సాధించిన వార్డు సభ్యులు ఎమ్మె ల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు మర్యాద పూర్వకంగా కలిశారు.

శ్రీ విద్యాసర్వ మంగళపీఠాన్ని దర్శించుకున్న చైర్పర్సన్ బెలగాం జయబాబు దంపతులు

ఉదయం ప్రతినిధి –పార్వతీపురం



పార్వతీపురం మున్సిపల్ చైర్మన్ బెలగాం జయబాబు దంపతులు పట్టణంలో శ్రీ విద్యా సర్వ మంగళ పీఠాన్ని స్థానిక దుర్గ చెట్టుని పీఠం దర్శించుకొని అనంతరం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ మురుపాక కాళిదాస్ శర్మ ఆశీస్సులను పొందడం జరిగిందని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం పై ఓట్లేసిన ప్రజలందరూ ఏ సమస్యను పోరాడుతానని అందుకు గౌరవ ఎమ్మెల్యే విజయ్ చంద్ర పట్టణ ప్రజలకు అండగా ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. పట్టణ కావాల్సిన త్రాగునీరు డెంపింగ్ యార్డ్ కాలువలు పరిశుభ్రత పలు సమస్యలను నెరవేర్చుతానని ఆమె తెలిపారు.అనంతరం పీఠాధిపతి మురపాక ఖాళీ స్వామి మీ ప్రభుత్వంలో అంతా మంచి జరగాలని ప్రజాస్వామ్యంపై నమ్మకం కలిగించే విధంగా పనిచేయాలని తెలుపుతూ ఎల్లవేళలా అమ్మవారు ఆశీస్సులు నిరంతరం మీకు ఉంటాయని చైర్మన్ దంపతులకు ఆశీర్వదించారు.

జరజాపు కృషితో విజయకుమారి గెలుపు



ఉదయం ప్రతినిధి – సాలూరు

జరజాపు సోదరుల వ్యూహంతో గ్లాసు గుర్తు అభ్యర్థి గొర్లె విజయకుమారీకి గెలుపు వరించందనే చెప్పుకోవచ్చు. మున్సిపల్ చైర్మన్ సీటు రిజర్వేషన్లో బీసి మహిళకు కేటాయించడంతో తెలుగుదేశం పార్టీ తరుపున వ్యూహాత్మకంగా మంత్రి అనుచరుడు బార్యను ముందు ప్రకటించారు. ఈలోపు చాకచక్యంగా గొర్లె విజయ కుమారి భర్త మధు, రాత్రికి రాత్రే నాగాబాబును ప్రశ న్నం చేసుకొని జనసేన పార్టీ తరఫున సీటును దక్కించుకున్నారు. సాలూరులో స్తబ్దతగా వున్న జనసేన పార్టీ జరజాపు సూరిబాబు తన సోద రుల రాకతో పార్టీని పరుగులు పెట్టించారు. ఆ మేరకు చైర్పర్సన్ రేసులో జర జాపు సూరిబాబు కోడలు దీప్తిని రేసులో నిలబెట్టేందుకు ఆశక్తి చూపించారు.మధు సీటు తెచ్చుకోవడంతో తొలుత సూరిబాబు అసహనంతో వున్న మాట వాస్తవమే అయినాప్పటికీ, గొర్ల మధు సీటు తెచ్చుకోవడంతో కూటమి ధర్మాన్ని పాటిస్తూ, గొర్ల విజయకుమారి విజయం కోసం అనుక్షణం సూరిబాబు కష్టపడ్డారనే పురవాసులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ ఆర్. వైశాలి



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం / సాలూరు

రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పార్వతీపురం, సాలూరు మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని (డిస్ట్రిబ్యూషన్ సెంటర్) జాయింట్ కలెక్టర్ ఆర్. వైశాలి పరిశీలించారు. పంపిణీ కేంద్రంలో చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఆమె, ఎన్నికల ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా అత్యంత సమర్థవంతంగా మరియు ప్రశాంతమైన వాతావరణంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, పంపిణీ కేంద్రం వద్ద, స్ట్రాంగ్ రూమ్‌ల ప్రాంగణంలో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచాలని, రక్షణ చర్యల్లో ఎలాంటి అలసత్వం వహించకూడదని సూచించారు. విధులకు హాజరయ్యే పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కౌంటర్ల వద్ద తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, అత్యవసర వైద్య సౌకర్యాలను పక్కాగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. అలాగే ఎన్నికల సామగ్రి పంపిణీ శీఘ్రంగా జరగాలని, రూట్ ఆఫీసర్లు, రవాణా అధికారులు సమన్వయంతో వ్యవహరించి పోలింగ్ బృందాలు సురక్షితంగా తమ కేంద్రాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

విజయానికి కారణమైన వినాయకుడికి చైర్ పర్సన్ బెలగాం కరుణ ప్రత్యేక పూజలు



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

పార్వతీపురం పురపాలక సంఘం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఘన విజయం సాధించిన సంద ర్భంలో కూటమి అభ్యర్థి మున్సిపల్ చైర్మన్ బెలగాం కరుణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బెలగాం జయ బాబుతో కలిసి తొలిసారిగా వినాయకుని ఆలయాన్ని సందర్శించి స్వామివా రిని దర్శించుకున్నారు. తన విజయానికి వినాయకుడి ఆశీస్సులే కారణమని భావిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించి కృతజ్ఞతలు తెలియజేశారు.ఘన విజయం అనంతరం తొలిసారిగా వినాయకుడి సన్నిధికి చేరుకున్న బెలగాం కరుణ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి రానున్న రోజుల్లో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని స్వామివారిని ప్రార్థించారు. పట్టణ ప్రజలు విశ్వాసాన్ని ప్రజల సేవ రూపంలో అందించడం భగవంతుడు రూపకల్పన ఎంతైనా ఉందని అన్నారు.గౌరవ ఎమ్మెల్యే విజయ్ చంద్ర సహకారంతో పట్టణంలో ఉన్న సమస్యలన్నిటికీ ప్రణాళికతో నెరవేర్చే బాధ్యత మా ఆంధ్రపై ఉందని అన్నారు. ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదములు చైర్మన్ దంపతులు తెలిపారు.

ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్

ఉదయం ప్రతినిధి – విజయనగరం

జిల్లాలో గురువా రం జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ప్రశాంత యుతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ తెలిపారు.జిల్లాలో 27 జడ్పీ టిసి, 438 ఎం.పి.టి.సి స్థానాలకు గాను 895 ప్రాంతాల్లో 1586 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగను న్నాయ న్నారు. ఇందుకుగాను జిల్లా ఇద్దరు అదనపు ఎస్పీలు, 7గురు డీఎస్పీలు, 35మంది సిఐలు, 75 మంది ఎస్సైలతో సహా సుమారు 2000మందిని బందోబస్తు నిమిత్తం వినియోగిస్తున్నామన్నారు. ఎన్నికలను శాంతియుతంగా, సజా వుగా, పారదర్శకంగా నిర్వహిం చేందుకు పోలింగ్ లోకేషన్స్ ను 196 రూట్ లగా విభ జించామన్నారు. ఈ రూట్లలో ఎటువంటి అల్లర్లు జరగకుండా 56 ప్లైకింగ్ ఫోర్స్ లను, 27 స్పెషల్ ప్లైకింగ్ ఫోర్సు లను, జోనల్ ప్లైకింగ్ ఫోర్స్ లను ఏర్పా టు చేశామన్నారు.పోలింగ్ మెటీరియల్ పంపిణీ నుంచి స్ట్రాంగ్ రూమ్‌లు చేరే వరకు పూర్తి రక్షణ కల్పిస్తున్నా మన్నారు. అతి సమస్యాత్మక, సమస్యాత్మక ప్రాంతా ల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద డ్రోన్లు, సీసీ కెమెరాల నిఘా పెట్టామన్నారు. ఇప్పటికే రౌడీ షీటర్లతో సహా 20వేల మందిని మంచి ప్రవర్తన కోసం బైండోవరు చేసి, రూ. 2-3 లక్షల నగదు వరకు సెక్యూరిటీ బాండ్స్ తీసుకు న్నామన్నారు. మద్యం, నగదు అక్రమ రవాణాపై చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్ల నిఘా పెట్టామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.అత్యవసర సమాచారం స్థానిక పోలీస్ లేదా టోల్ ఫ్రీ 100/112కు కాల్ చేయాలని జిల్లా ఎస్పీ దామోదర్ కోరారు.

ప్రణాళికాబద్ధమైన పోలీస్ బందోబస్తు, పటిష్ట భద్రత నడుమ

ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

మన్యం జిల్లాలో పార్వతీపురం,సాలూరు, పాలకొండ మున్సిపల్ ఎన్నికల నిర్వహణతో పాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎలాంటి అవాంఛనీయ సంఘట నలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, పటిష్ట పోలీస్ భద్రత మధ్య విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ ఎస్.వి. మాధవ్ రెడ్డి, ఐపీఎస్ గారు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలోనూ ముందస్తు ప్రణాళికతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం, సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచడం, సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీస్ బలగాలను మోహరించడం వంటి చర్యలు చేపట్టడం వల్ల జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిం దని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, కేంద్రాల పరిసరాల్లో నిరంతర పోలీస్ నిఘా, గస్తీ నిర్వహించినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే అనుమతించడం, జనసమూహాలను నియంత్రించడం, ర్యాలీల సమయం



లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల సమయం లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, రాజ కీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు ఎన్ని కల నియమ నిబంధనలను పాటించేలా పోలీస్ అధికా రులు సమన్వయంతో విధులు నిర్వహించారని తెలిపా రు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా బందోబస్తు నిర్వహిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది,

జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి

ఇతర శాఖల అధికారుల సమన్వయ కృషిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి ఎన్నికల ప్రక్రియ విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా పార్వతీపురం మన్యం జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగియడానికి సహకరించిన అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మీడియా ప్రతినిధులకు జిల్లా ఎస్పీ శ్రీ ఎస్.వి. మాధవ్ రెడ్డి, ఐపీఎస్ గారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న వీఒఆర్ఓ ఎన్నికల్లో కూడా ఇదే తరహాలో ముందస్తు కార్యాచరణ, పటిష్టమైన భద్రతా ప్రణాళిక, సమర్థవంతమైన బందోబస్తు, శాఖల మధ్య సమన్వయంతో విధులు నిర్వహించేలా అధికారులు ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సూచించారు.

పార్వతీపురం మండలంలో పకడ్బందీగా పోలింగ్ మెటీరియల్ పంపిణీ

డిఆర్డిఎ ప్రాజెక్ట్ అధికారి ప్రభావతి

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

రేపు జరగనున్న జెడ్పీటీసి, ఎంపీటీసీ పోలింగ్ ప్రక్రి యకు సంబంధించిన ఏర్పాట్లు మరియు మెటీరియల్ పంపిణీ పూర్తిస్థాయిలో పకడ్బందీగా జరుగుతున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ప్రభావతి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్వతీపురం మండ లంలో మొత్తం 4 జోన్లు, 7 రూట్లు ఉండగా, 57 పోలిం గ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు గా జోన్ల వారీగా మెటీరియల్ కేటాయించి, అల్పాహారం, భోజన వసతులు కూడా సమకూర్చినట్లు చెప్పారు.ప్రతి పోలింగ్ స్టేషన్‌కు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక పోలింగ్ ఆఫీసర్, సహాయ ప్రిసైడింగ్ ఆఫీసర్‌తో పాటు నలుగురు ఓపీవోలను కేటాయించినట్లు తెలిపారు. అలాగే సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాలను వీడియో గ్రఫీ చేయిస్తున్నట్లు, హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్ కేంద్రాల పై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆమె స్పష్టం చేశారు. ఓటర్లం దరూ ఎలాంటి అపోహలకు గురికాకుండా, ప్రశాంత వాతా వరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలని డిఆర్డిఎ ప్రాజెక్ట్ అధికారి విజ్ఞప్తి చేశారు.

వ్యాన్‌ని ఢీకొని యువకుడు మృతి

ఉదయం ప్రతినిధి – గజపతినగరం

మెంటాడ మండలం మీసాల పేట గ్రామానికి చెందిన గంట్యాడ రోహిత్ కుమార్ అనే యువకుడు విశాఖప ట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు డ్యూటీ నిమిత్తము బుధవారం అర్ధరాత్రి సుమారు 2 గంటల 30 నిమిషాల సమయంలో మోటార్ బైక్ పై విశాఖపట్నం వెళుతుండగా మరిపిల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న మినీ వ్యాన్‌ని ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రోహిత్ కుమార్ అంబులెన్స్‌లో స్థానిక గజపతినగరం ఏరియా ఆసుప త్రికి తీసుకొని రాగా తెల్లవారుజామున సుమారు 3. 40 నిమిషాలక చికిత్స పొందుతూ మరణించినట్లు ఫిర్యాదు నమోదు చేయడం అయిందని ఎస్సై కే కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్ ఐ కే కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు

జిల్లాలో పోలింగ్ స్థానాలు మరియు ఓటర్ల వివరాలు

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

జిల్లా వ్యాప్తంగా మొత్తం 15 మండలాల్లో 799 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 6,43,876 గా నమోదైంది. మొత్తం ఓటర్లలో మహిళల ఓట్ల సంఖ్య పురుషుల కంటే ఎక్కువగా ఉండటం విశేషం. పురుష ఓటర్లు 3,14,901 మంది ఉండగా, మహిళా ఓటర్లు 3,28,910 మంది ఉన్నారు, అలాగే ఇతరులు (మూడో లింగం) 65 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు.

మండలాల వారీగా పూర్తి వివరాలు

వీరఘట్టం: ఈ మండలంలో 19 వీఒఆర్ సెగ్మెంట్లు, 63 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 51,891 మంది ఓటర్లు ఉండగా, అందులో 25,416 మంది పురుషులు మరియు 26,475 మంది మహిళా ఓటర్లు ఉన్నారు

బలిజిపేట: ఇక్కడ 20 వీఒఆర్ సెగ్మెంట్లు, 70 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. మొత్తం ఓటర్ల సంఖ్య 51,578 కాగా, అందులో 25,913 మంది పురుషులు, 25,659 మంది మహిళలు మరియు 6 మంది ఇతరులు ఉన్నారు

పార్వతీపురం: 17 MPTC సెగ్మెంట్లు, 57 పోలింగ్ కేంద్రాలు కలిగి ఉంది. ఇక్కడ మొత్తం 51,406 మంది ఓటర్లు (25,237 మంది పురుషులు, 26,168 మంది మహిళలు, 1 ఇతరులు) ఉన్నారు

సీతానగరం: 17 MPTC సెగ్మెంట్లు మరియు 57 పోలింగ్ స్టేషన్లతో మొత్తం ఓటర్ల సంఖ్య 47,592 గా ఉంది. ఇందులో 23,599 మంది పురుషులు, 23,992 మంది మహిళలు, 1 ఇతరులు ఉన్నారు

సీతాంపేట: 16 MPTC సెగ్మెంట్లు, 67 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ 21,484 మంది పురుషులు, 23,933 మంది మహిళలు, 13 మంది ఇతరులతో కలిపి మొత్తం 45,430 మంది ఓటర్లు ఉన్నారు

సాలూరు: 16 MPTC సెగ్మెంట్లు, 52 పోలింగ్ కేంద్రాల ద్వారా మొత్తం 44,889 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 21,755 మంది పురుషులు మరియు 23,134 మంది మహిళా ఓటర్లు ఉన్నారు

జియ్యమ్మవలస: 15 MPTC సెగ్మెంట్లు, 48 పోలింగ్ స్టేషన్లతో మొత్తం ఓటర్లు 44,163 మంది ఉన్నారు. వీరిలో 21,952 మంది పురుషులు, 22,204 మంది మహిళలు, 7 మంది ఇతరులు ఉన్నారు

మక్కువ: 14 MPTC సెగ్మెంట్లు, 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ 20,871 మంది పురుషులు మరియు 21,614 మంది మహిళలతో మొత్తం 42,485 మంది ఓటర్లు నమోదు చేసుకున్నారు

కొమరాడ: 15 MPTC సెగ్మెంట్లు, 55 పోలింగ్ కేంద్రాలలో మొత్తం 41,457 మంది ఓటర్లు ఉన్నారు. ఇతిల్ 20,054 మంది పురుషులు, 21,400 మంది మహిళలు, 3 మంది ఇతరులు ఉన్నారు

గరుగుబిల్లి: 16 MPTC సెగ్మెంట్లు, 49 పోలింగ్ కేంద్రాలు కలిగి ఉంది. ఇక్కడ మొత్తం 38,959 మంది ఓటర్లు ఉండగా (19,583 పురుషులు, 19,376 మహిళలు) ఉన్నారు

భామిని: 13 MPTC సెగ్మెంట్లు, 48 పోలింగ్ కేంద్రాల ద్వారా మొత్తం ఓటర్ల సంఖ్య 38,167 గా ఉంది. ఇందులో 18,727 మంది పురుషులు, 19,440 మంది మహిళలు ఉన్నారు

పాచిపెంట: 14 MPTC సెగ్మెంట్లు, 46 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ 18,465 మంది పురుషులు, 19,038 మంది మహిళలు, 1 ఇతరులు కలిపి మొత్తం 37,504 మంది ఓటర్లు ఉన్నారు

పాలకొండ: 12 MPTC సెగ్మెంట్లు, 46 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. మొత్తం ఓటర్ల సంఖ్య 37,465 గా కాగా, అందులో 18,494 మంది పురుషులు, 18,970 మంది మహిళలు, 1 ఇతరులు ఉన్నారు

కురుపాం: 14 MPTC సెగ్మెంట్లు, 48 పోలింగ్ స్టేషన్లలో మొత్తం 35,853 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 17,242 మంది పురుషులు, 18,599 మంది మహిళలు, 12 మంది ఇతరులు ఉన్నారు.

జి.ఎల్.పురం (గుమ్మలక్ష్మీపురం): 14 MPTC సెగ్మెంట్లు, 43 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 35,037 మంది ఓటర్లు నమోదు కాగా, వారిలో 16,109 మంది పురుషులు, 18,908 మంది మహిళలు, 20 మంది ఇతరులు ఉన్నారు

అల్లర్లు సృష్టిస్తే క్రిమినల్ కేసులు:డీఎస్పీ

390 మంది సిబ్బందితో పటిష్ట చర్యలు

ఉదయం ప్రతినిధి – చీపురుపల్లి

చీపురుపల్లి డివిజన్లో గురువారం జరిగే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామని, 390 మంది సిబ్బందిని ఎన్నికల కోసం వినియోగించడం జరుగుతుందని డీఎస్పీ ఎస్ రాఘవులు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఒక డీఎస్పీ ని ఇన్చార్జిగా నియమించడం జరిగిందని, రాజాం నియోజకవర్గానికి డీఎస్పీ కోటిరెడ్డి ని నియమించడం జరిగిందన్నారు. అదే విధంగా ప్రతి మండలానికి ఒక సిఐ ఆధ్వర్యంలో స్పెషల్ ప్లైకింగ్ ఫోర్స్ , ఎస్సై ఆధ్వర్యంలో రెండు ప్లైకింగ్ ఫోర్స్ లు,



మొబైల్ పార్టీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. ప్రతి మండలంలో కనీసం 10 మొబైల్ పార్టీలు ఉంటాయని, చీపురుపల్లి సబ్ డివిజన్లో 66 మొబైల్ పార్టీలు ఏర్పాటు చేశామని చెప్పారు. వీరంతా సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టిని కేంద్రీకరిస్తారన్నారు. సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి సబ్ డివిజన్ పరిధిలో 6,256 మంది వ్యక్తులపై బైండోవర్ కేసులు పెట్టామన్నారు. సబ్ డివిజన్ పరిధిలో నేర చరిత్ర కలిగి ఉన్న 83 మందిపై కూడా బైండోవర్ కేసులు పెట్టినట్టు వివరించారు. వీరందరి వద్ద నుండి ఒక ఏడాది పాటు మంచి ప్రవర్తన కలిగి ఉంటామని లేని పక్షంలో రెండు లక్షల రూపాయలు ప్రభుత్వానికి చెల్లిస్తామని బాండ్లు తీసుకున్నామన్నారు. అల్లర్లు సృష్టించడానికి అవకాశం ఉన్న వ్యక్తులపైన ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేసినట్టు రాఘవులు తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా పోలీసులకు సహకరించి ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆయన కోరారు. ఓటు వేయడానికి వచ్చినవాళ్లు తప్పనిసరిగా ఎవరితోనూ మాట్లాడకూడదు, లైన్లో మాత్రమే ఉండాలి, నిశ్శబ్దంగా ఉండాలి, ఎవరితోటి మాట్లాడకూడదు, సెల్ ఫోనులు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు బయటే విడిచి పెట్టాలి, ఏ విధమైన వస్తువులను పోలింగ్ స్టేషన్ లోపలికి తీసుకొని వెళ్ళకూడదు, ఓటు వేసిన వెంటనే ఎవరింటికి వాళ్లు వెళ్లిపోవాలి అంతేగాని బయటకు వచ్చి ఎవరితోను ఓట్ల గురించి గానీ ఎన్నికల గురించి గానీ మాట్లాడకూడదని సూచించారు. దొంగ ఓట్లు వేయడానికి వచ్చిన వారిపైన, వారిని ప్రోత్సహించే వారి పైన తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. అదేవిధంగా144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటాయి కాబట్టి ఎవరూ గుంపులుగా ఉండకూడదు, పోలీసులు సూచించిన వంద మీటర్ల లోపు ఎవరు కూడా అనవసరంగా నిలబడకూడదని, ప్రజలందరూ సీసీటీవీ పర్యవేక్షణలో ఉంటారన్న విషయాన్ని గమనించి శాంతియుతంగా మెలగాలని ఎన్నికలు సజావుగా జరగడానికి పోలీసులకు సహకరించాలని కోరారు.

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో నేత్ర శస్త్ర చికిత్సలు



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

మన్యం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నేత్ర వైద్య విభాగం మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణులు, ఆసుపత్రి ఆర్ ఎం ఓ డా శ్యామల పర్యవేక్షణలో ఈ రోజు నేత్ర వైద్యులు డా వెంకటేష్ మరియు డా శ్రావణి కేటరాక్ట్ (అంతరకుసుమం) శస్త్ర చికిత్సలు నిర్వహించి వారికి తిరిగి కంటిచూపు పొందేందుకు కృషి చేసినట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. శస్త్ర చికిత్సలు అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు ఆసుపత్రి నేత్ర వైద్య అధికారి ఎస్ వి ఆర్ కృష్ణారావు, టి . శ్రీనివాసరావు రోగులకు వివరించారు. చూపు మెరుగుపడాలన్నా, కళ్ళు ఆరోగ్యంగా ఉండాలన్నా సరైన ఆహారం తీసుకోవడం, కంటి వ్యాయామాలు చేయడం మరియు మంచి అలవాట్లను పాటించడం చాలా ముఖ్యం. క్యారెట్లు, బొప్పాయి, చిలగడదుంపలు, పాలకూర మరియు గుడ్లు తీసుకోవాలి. ఇవి రాత్రి దృష్టిని మరియు కంటి పనితీరును మెరుగుపరుస్తాయి. నారింజ, జామ, నిమ్మజాతి పండ్లు, బాదంపప్పులు మరియు సన్ ఫ్లవర్ గింజలు తినాలి. ఇవి కంటికి ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షణ ఇస్తాయి.చేపలు, వాల్‌నట్స్, అవిసె గింజలు ఆహారంలో చేర్చుకోవాలి. ఆకుకూరలు, గుమ్మడి గింజలు మరియు పప్పుధాన్యాలు కంటి పొరను ఆరోగ్యంగా ఉంచుతాయి.20-20-20 రూల్: ప్రతి 20 నిమిషాలకోసారి కంప్యూటర్ లేదా ఫోన్ స్క్రీన్ నుండి దృష్టి మళ్లించి, 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును కనీసం 20 సెకన్ల పాటు చూడాలి. ఏదైనా స్క్రీన్ చూస్తున్నప్పుడు కనురెప్పలార్పడం తగ్గుతుంది. కాబట్టి తరచుగా కళ్లు ఆర్పుతుండాలి.రెండు చేతుల అరచేతులను పరస్పరం రుద్ది వెచ్చగా చేసి, కళ్ళ మీద ఒత్తిడి పడకుండా మెత్తగా ఉంచుకోవాలి. దగ్గరగా ఉన్న వస్తువును, ఆ తర్వాత వెంటనే దూరంగా ఉన్న వస్తువును మార్చి మార్చి చూడాలి.ప్రతిరోజూ 7 నుండి 9 గంటల నిద్ర కళ్లకు విశ్రాంతిని ఇస్తుంది. ఎండలోకి వెళ్ళినప్పుడు నాణ్యమైన సన్ గ్లాసెస్ ధరించాలి. ధూమపానం మానేయాలి, ఇది కంటి నరాలను దెబ్బతీస్తుంది.క్రమం తప్పకుండా కంటి వైద్యుడినిసంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి.కంటి వ్యాయామాలు కంటి అలసటను తగ్గిస్తాయి.మీకు ఏదైనా కంటి సమస్యలు దూరపు చూపు మందగించడం, కంటి మంట లేదా నీరు కారడశీ లేదా చిన్నపిల్లల కంటి చూపు వెంటనే నేత్ర వైద్యులుని సంప్రదించి సలహాలు, సూచనలు పొందాలి.క్యారెట్లు, ఎరుపు రంగులో ఉండే క్యాప్సికం, బ్రోకలీ, పాలకూర, స్ట్రాబెర్రీలు, చిలగడదుంపలు, నిమ్మజాతి పండ్లు, యాపిల్స్, టమాటా వంటి ఆహారాలను తీసుకోవడం వలన కంటి చూపు మెరుగు పడుతుంది అని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి డా జీరు నగేష్ రెడ్డి తెలిపారు.

Owner,Editor, Publisher : SIVA SANKARA VENKATA PRASADA RAO PALLA, Published from H.NO: 1-19-17, BC COLONY, AGRAHARAM, VIZIANAGARAM, ANDHRA PRADESH - 535004. Printed at NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA , KURNOOL, ANDHRA PRADESH - 518380.
Editor : SIVA SANKARA VENKATA PRASADA RAO PALLA. Registration Number : APTEL/26/A5462